ప్రజాశక్తి

బుధవారం 13 సెప్టెంబర్ 2023 | 5 | పార్వతీపురం మన్యం

బాలింత మృతి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గొటివాడ పంచాయతీ బల్లుకోటకు చెందిన రెండు నెలల గిరిజన బాలింత మృతి చెందింది. బల్లుకోటకు చెందిన కొండగొర్రి సుశీల(30) రెండు నెలలు క్రితం మగబిడ్డకు జన్మనిచ్చింది. గడచిన నెలరోజులుగా తీవ్రమైన కడుపు నొప్పితో ఇబ్బంది పడి రేగిడి పిహెచ్‌సికి తీసుకెళ్లగా, వారు మందులు ఇచ్చి పంపారు. అయినా సమస్య యధాతథంగా ఉండడంతో కుటుంబ సభ్యులు పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు చేసి వైద్యం అందించిన వైద్యులు ఆరోగ్యం బాగా ఉందని డిస్చార్చి ఇచ్చి ఇంటికి పంపగా సోమవారం రాత్రి ఇంట్లో నే తుదిశ్వాస విడిచింది. భర్త కుమార్, బంధువులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు.

నర్సింగ్ హోములున్న డాక్టర్లకు ధర్మాసుపత్రి పగ్గాలా?

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కోసం పైరవీలు
డిప్యూటీ సిఎంపై ఒత్తిడి పెంచే ప్రయత్నాలు

ప్రజాశక్తి - సాలూరు

ప్రయివేటు నర్సింగ్ హోములున్న డాక్టర్లకు ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ బాధ్యతలు అప్పగించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైద్యశాఖ ఉన్నతాధికారులు ముడుపులు తీసుకుని ఇష్టారాజ్యంగా ఉత్తర్వులు జారీ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని వందపడకల ఆసుపత్రికి సూపరింటెండెంట్‌గా సీనియర్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌ను నియమించాల్సి ఉంది.ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో ఐదుగురు సీనియర్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌లు పని చేస్తున్నారు. వీరిలో అందరికన్నా సీనియర్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ వేణుగోపాల్ కొంతకాలం పాటు సూపరింటెండెంట్‌గా పని చేశారు. ఆయన ఈ ఏడాది నవంబర్‌లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆరోగ్య కారణాల రీత్యా సూపరింటెండెంట్ బాధ్యతల నుంచి ఆయన తప్పుకున్నట్లు తెలుస్తోంది. ఆయన తర్వాత సీనియర్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ డాక్టర్ రత్నకుమారి ఇప్పుడు ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే మిగిలిన ముగ్గురు సీనియర్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌ల్లో జూనియర్ అయిన మహిళా డాక్టర్‌ను ఇంఛార్జి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు. పట్టణంలో ప్రయివేటు నర్సింగ్ హెూం నడుపుతున్న ఆ మహిళా వైద్యాధికారికి ధర్మాసుపత్రి పగ్గాలు ఎలా అప్పగిస్తారనే చర్చ జరుగుతోంది. ఆమె భర్త కూడా పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్నారు. ఆ మహిళా వైద్యాధికారికి సూపరింటెండెంట్ గా బాధ్యతలు ఇప్పించేందుకు ఆమె భర్త తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారపార్టీకి చెందిన కొందరు అగ్రనాయకుల అండతో పాటు స్థానిక నాయకులను ప్రసన్నం చేసుకోవడానికి ఆ మహిళా డాక్టర్ భర్త ప్రయత్నాలు సాగిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. పట్టణ వైసిపి నాయకుల ద్వారా డిప్యూటీ సీఎం రాజన్నదొరపై ఒత్తిడి పెంచేందుకు పైరవీలు మొదలు పెట్టినట్టు సమాచారం .ఇప్పటికే పట్టణంలో ఒక ప్రయివేటు నర్సింగ్ హెూం నడుపుతున్న ఒక ప్రభుత్వ డాక్టర్‌ను మండలంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది చాలదన్నట్లు అదే వైద్యాధికారిని ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఎంహెచ్‌ఓగా నియమించారు. ప్రయివేటు నర్సింగ్ హోములున్న డాక్టర్లకు ధర్మాసుపత్రుల పగ్గాలు, కీలకమైన అధికారి హెూదా బాధ్యత లు అప్పగించడం వల్ల నిరుపేద రోగులకు మెరుగైన సేవలు అందే అవకాశం లేదు. దీనికి తోడు పలు అక్రమాలకు పాల్పడ్డానికి ఎక్కువ అవకాశాలు వుంటాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు రాజకీయ ఒత్తిళ్లు, లంచాలకు తలొగ్గి ప్రయివేటు నర్సింగ్ హోమ్‌లు నడుపుతున్న డాక్టర్లకు ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ధర్మాసుపత్రులకు ఎక్కువగా నిరుపేద, దిగువ మధ్యతరగతి రోగులే ఎక్కువగా వైద్యం కోసం వెళుతుంటారు. ప్రయివేటు నర్సింగ్ హెూం లున్న డాక్టర్లకు ప్రభుత్వ ఆసుపత్రుల పగ్గాలివ్వడం వల్ల ఆ రోగులను తమ నర్సింగ్ హెూం లకు మళ్లించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇలాంటి సంఘటనలు గతంలో కొన్ని జరిగాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన వందపడకల ఆసుపత్రిలో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రి కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం రాజన్నదొర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సాలూరు ఏరియా ఆస్పత్రి

నెలాఖరులోగా సాలూరుకు రైలు బండి

ప్రజాశక్తి - సాలూరు

నెలాఖరులోగా పట్టణానికి రైలు బండి వచ్చే అవకాశం ఉంది. దీనికి సంబంధించి మంగళవారం విశాఖ డిఆర్‌ఎం సౌరవ్ ప్రసాద్ ఇతర రైల్వే అధికారులతో కలిసి రైల్వే ట్రాక్, స్టేషన్లను పరిశీలించారు. కొద్దిరోజుల్లో విజయనగరం, విశాఖపట్నం మధ్య నడుస్తున్న పాసింజర్ రైలు బండిని సాలూరు వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో డిఆర్‌ఎం సౌరవ్ ప్రసాద్ రైలు బండి నడపడానికి ఉన్న అవకాశాలను పరిశీలించారు. ట్రాక్ నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం సాలూరు రైలు స్టేషన్‌ను పరిశీలించారు. రైలు బండి ప్రారంభించే లోగా స్టేషన్ ఆధునీకరణ పనులు చేపట్టాలని కింద స్థాయి అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సీనియర్ డిసిఎం అఖిలేష్ త్రిపాఠి, సీనియర్ డిఒఎం సునీల్ కుమార్, సీనియర్ డిఇ ఎన్.అరుణ్ మరానా, సీనియర్ డిఎన్ సంజయ్ మీనా, సీనియర్ డిఇ ఆపరేషన్ శివప్రసాద్, డిఇ ట్రాఫిక్ బివి రమణ, ఎడిఎన్ ఎస్.కె.దీక్షిత్ ఉన్నారు.

ట్రాక్ పరిశీలించిన డిఆర్‌ఎం సౌరవ్ ప్రసాద్, అధికారులు

నియంతతో పోరాటం చేస్తున్నాం

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో ఒక నియంతపై పోరాటం చేస్తున్నామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. సైకో జగన్ ను గద్దె దించే వరకూ విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. మెకానిక్ టెంపుల్ వద్ద మంగళవారం టిడిపి ఉమ్మడి జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం కుట్రపూరిత దురుద్దేశంతోనే చంద్రబాబుపై వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్ ప్రజల్లో విశ్వాసం కోల్పోయారని, రానున్న ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించే విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకుడు చంద్రబాబని అన్నారు. వైసిపి అరాచకాలను ఎండగడుతుండటం, ప్రజల్లో రోజురోజుకూ టిడిపి ఆదరణ పెరుగుతుండటం వల్లే.. జగన్ ఈ కుట్ర పన్నారని చెప్పారు. అధినేత చంద్రబాబు నాయుడుకు తామంతా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలోనూ తెలుగుదేశం పార్టీ నాయకులు, అనుబంధ విభాగాలతో నిరాహార దీక్షలు చేపట్టనున్నామని వెల్లడించారు. ప్రతీ మండలం నుంచి నాయకులు ఒక్కోరోజు దీక్షలో కూర్చుంటారని చెప్పారు. అధినేతకు అక్రమంగా విధించిన రిమాండ్ పూర్తయ్యే వరకు దీక్షలను కొనసాగిస్తామన్నారు. సమావేశంలో పార్వతీపురం జిల్లా టిడిపి నాయకులు ద్వారపురెడ్డి జగదీష్ మాజీ ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, బొబ్బిలి చిరంజీవులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు బేబినాయన, తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కిమిడి నాగార్జున

సమగ్ర ఓటరు జాబితా రూపొందించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఓటరు పునశ్చరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఓటరు విచారణలో తప్పులు లేని ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందాలని ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో ఓటరు జాబితా తయారీపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంటింటి ఓటరు విచారణ చేసి శాశ్వతంగా గ్రామాలను వదలిన వారిని, మతి చెందిన వారిని, డుప్లికేట్ ఎంట్రీ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని తొలగించే కార్యక్రమం వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ ఓటరు సర్వే విచారణ కార్యక్రమంలో ప్రత్యేక పర్యవేక్షణతో మృతి చెందిన ఓటర్లు, శాశ్వత వలసలు, డబుల్ ఎంట్రీ ఓటర్లు తొలగింపు విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఫారం - 8ను స్వీకరించి పూర్తి స్థాయిలో పరిశీలన నాలుగు రోజుల్లో పూర్తవుతుందని చెప్పారు. ఓటర్ల తొలగింపు ప్రక్రియలో నోటీస్ జారీ, శాశ్వత వలసల ఓటర్లు, మరణించిన ఓటర్ల పంచనామా, వీడియో స్టేట్మెంట్, తదితర అంశాలతో పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఇంటింటి ఓటర్ల పరిశీలన జిల్లాలో దాదాపుగా పూర్తయ్యిందని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరణ చేపట్టి ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, పోలింగ్ కేంద్రాల వివరాలు తెలియజేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు కల్పనా కుమారి, సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకట్రావు, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆర్‌డిఒ కె.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్; పాల్గొన్న జెసి, ఐటిడిఎ పిఒలు

నేటి నుంచి జిల్లా ఆస్పత్రిలో ఇహెచ్ఎస్ సేవలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక జిల్లా ఆసుపత్రిలో బుధవారం నుండి ఉద్యోగ ఆరోగ్య పథకం (ఎంప్లాయిస్ హెల్త్ స్కీం - ఇ.హెచ్.ఎస్) కింద వైద్య సేవలు అందించనున్నట్టు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి తెలిపారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి ఔట్ పేషెంట్ సేవలు బుధ వారం నుంచి అందిస్తామన్నారు. డిస్పెన్సరీ విధానంలో సేవలు అందుతాయని, ఇందులో కన్సల్టేషన్, డయాగ్నస్టిక్స్, మెడిసిన్ అందించడం జరుగుతుందని, రిఫరల్ సేవలకు పై స్థాయి ఆసుపత్రులకు పంపిస్తామన్నారు. మెడికల్ రీయింబర్స్ మెంట్ కింద రూ.2 లక్షల విలువ వరకు ప్యాకేజీ అందించేందుకు అవకాశం ఉందని ఆమె అన్నారు. ఇహెచ్ఎస్‌లో సెప్టెంబరులో ఆయా తేదీల్లో వైద్యం అందించే వైద్యుల వివరాలు సిద్ధం చేశామని ఆమె చెప్పారు.

చైల్డ్ వెల్ఫేర్ కమిటీల నియామకానికి చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

కొత్త జిల్లాలకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డులు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ జిల్లా ప్రొబేషన్ అధికారి ఎం.శరత్ బాబు మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డుల చైర్మన్, సభ్యులు, సామాజిక కార్యకర్తల నియామకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువును అక్టోబర్ 3 వరకు పొడిగించినట్లు ఆయన చెప్పారు. కొత్త జిల్లాలతో పాటు కృష్ణా, చిత్తూరు, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల్లో కూడా చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జువెనైల్ బోర్డుల ఖాళీలను భర్తీ చేస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 3వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అర్హతలు, దరఖాస్తు ఫారం, అనుభవం, ఎంపిక విధానం తదితర వివరాల కోసం http://wdcw.ap.gov.in వెబ్ సైట్‌ను చూడాలని ఆయన కోరారు.

వాయిదా పడ్డ 'జగనన్నకు చెబుదాం'

పార్వతీపురం రూరల్ : అనివార్య కారణాల వల్ల బుధవారం తమ కార్యాలయంలో జరగాల్సిన జగనన్నకి చెబుదాం కార్యక్రమం వాయిదా పడినట్లు ఎంపిడిఒ జి.రమణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వాయిదా పడ్డ ఈ కార్యక్రమం మరలా ఎప్పుడు జరిగేది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

మనో వేదనతో

పిల్లలకు విషమిచ్చి..తానూ తీసుకొని

తల్లిమృతి..పిల్లల పరిస్థితి విషమం

హైమావతి (ఫైల్)

ప్రజాశక్తి-విజయనగరం టౌన్/మక్కువ

తీవ్ర మనోవేదనతో సతమతమవు తున్న ఓ తల్లి.. తన ఇద్దరు పిల్లలకు విషం పట్టి, అనంతరం ఆమె కూడా విషం తాగిన ఘటన విజయనగరంలో రెండు రోజుల క్రితం వెలుగు చూసింది. ఈ ఘటనలో తల్లి మృతి చెందగా, పిల్లల పరిస్థితి విషమంగా ఉంది. హృదయ విదారకరమైన ఈ ఘటన జిల్లా కేంద్రంలోని కామాక్షినగర్ రెండు రోజుల కిందట చోటు చేసుకోగా, మంగళవారం వెలుగులోకి వచ్చింది.

పోలీసుల కథనం ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామానికి చెందిన బి.హైమావతి (29)కు, తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌కు చెందిన వి.కుమార్‌తో నాలుగేళ్ల క్రితం వివాహ మైంది. కుమార్ ప్రస్తుతం సికింద్రాబాద్‌లో ఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. హైమావతి విజయనగరం కలెక్టరేట్ రెవెన్యూ విభాగంలో కార్యాలయ సబార్డినేటుగా చిరుద్యోగం చేస్తుంది. వీరికి మూడేళ్ల పాప లతిక్ష, ఏడాదిన్నర బాబు ఉన్నారు. హైమావతి తండ్రి కృష్ణ గిరిజన ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేసి విధి నిర్వహణలో చనిపోయారు. కృష్ణకు లలిత, హైమావతి, సుమ ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. అందులో హైమావతి రెండో సంతానం. తండ్రి చనిపోవడంతో కారుణ్య నియామకం కింద హైమావతికి ఉద్యోగం ఇచ్చారు. భర్త ఉద్యోగం వల్ల దూరంగా ఉండ టం, తాను నిరంతరం కార్యాలయంలో పని చేస్తుండటం, పిల్లల ఆలనా, పాలనకు దూరమవుతు న్నారనే మనో వేదన ఆమెను కలచి వేసింది. ఈనెల 10న ఉదయం 9గంటల సమయంలో గడ్డి మందును పిల్లలకు పట్టి.. ఆ తరువాత ఆమె కూడా తాగేసింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న వీరిని హైమావతి సోదరి సుమ గమనించి వెంటనే 108కు సమాచారం ఇచ్చి తొలుత ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించేందుకు విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. అయితే సమయం లేదని నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. ప్రైవేటు ఆసుపత్రి వైద్యుల పరిశీలించి పిల్లల పరిస్థితి బాగోలేదని వెంటనే విశాఖపట్నం తరలించాలని సూచించడంతో పిల్లల్ని విశాఖ తరలించారు. చికిత్స పొందుతూ హైమావతి చనిపోగా, పిల్లల పరిస్థితి విషమంగా ఉంది. మృతురాలి తల్లి బి.సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఒకటో పట్టణ ఎస్ఐ మురళి తెలిపారు.

అనారోగ్యంతో గిరిజన విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - పాలకొండరూరల్

స్థానిక బాలికల పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న సవర సుమిత్ర (17) సోమవారం శ్రీకాకుళం ఆసుపత్రిలో వైద్యం పొందుతూ మృతి చెందింది. ఆమె సీతంపేట మండలం కోసరిగూడ ఎర్రన్న గూడ సెంటర్ గ్రామానికి చెందినది. విషయం తెలుసుకున్న వెంటనే ఎటి డబ్ల్యూఒ జి.మంగవేణి, ప్రధానోపాధ్యాయులు పి.నారాయుడు, డిప్యూటీ వార్డెన్ విద్యార్థిని తల్లిదండ్రులకు ఓదార్చారు. రూ.5వేలు దాన సంస్కరణ కింద అందజేసినట్లు తెలిపారు.

15న జాబ్‌మేళా

విజయనగరం: నగరంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 15న హెటిరో లాబ్స్ లిమిటెడ్ ఆధ్వర్యాన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సాయిదేవమణి తెలిపారు. ఎంఎస్‌సి కెమిస్ట్రీ (ఆర్గానిక్/అనలైటికల్), బి ఫార్మసీ అభ్యర్థులు క్యూసీ/క్యూఎ విభాగంలో కెమిస్ట్/ఆఫీసర్ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఉదయం 9గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని, ముందుగా 9963069332, 9032772661 నంబర్లలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జెసి రమేష్

ఆరోగ్య సురక్ష శిబిరాలకు సిద్ధం కావాలి

వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆరోగ్య సురక్ష శిబిరాలకు సిద్ధం కావాలని వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ సిబ్బందికి సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ బి.జగన్నాథరావుతో కలిసి జిల్లాలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో ఈనెల 30న ప్రారంభమయ్యే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి జిల్లాలో గల ఎఎన్‌ఎంలు, సిహెచ్‌ఒలు ప్రతి గ్రామంలో ముందుగా చేయాల్సిన స్క్రీనింగ్ గురించి దిశా నిర్దేశం చేశారు. ఈనెల 30నుంచి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లకు కావాల్సిన సన్నాహక చర్యలు ముందుగానే చేపట్టాలని ఆదేశించారు. ప్రజలంతా ఈ క్యాంపులను వినియోగించుకొనేలా అవగాహన పెంచాలని సూచించారు.

క్షయ రోగ నిర్ధారణలో జాప్యం ఉండరాదు

క్షయ రోగ నిర్ధారణలో జాప్యం ఉండరాదని జాయింట్ డైరెక్టర్ ఆదేశించారు. జిల్లా క్షయ నివారణ విభాగంతో సమీక్ష నిర్వహించి క్షయ రోగ నిర్ధారణలో జాప్యం లేకుండా చూసుకోవాలని, అలాగే ప్రతి క్షయ రోగి మందులు తప్పని సరిగా వాడేలా చూడాలని అన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తప్పని సరిగా కల్లే పరీక్ష జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ డి.భాస్కరరావు, డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికలు

క్రీడల్లో రాణించాలి

పలుచోట్ల ఘనంగా ప్రారంభమైన పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మండల విద్యాశాఖ అధికారులు డి.గౌర్నాయుడు, ఆర్.ఆనందరావు క్రీడాకారులకు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో అండర్-14, 17 విభాగాల్లో మండల స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం ఉంటుందన్నారు. అందరూ క్రీడల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నట్లు వారన్నారు. కబడ్డీ, వాలీబాల్, కోకో, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, త్రోబాల్, టెన్నీ కాయింటు తదితరు క్రీడ పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.సుంబోరా అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేపీ నాగమణి, వ్యాయమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మజ్జి రామకష్ణ, ఆర్గనైజింగ్ సభ్యులు ఎస్.ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వి రాజేంద్ర, పద్మరాజు, సాల్మన్ రాజు, పోలరాజు, మధు, శ్రీను, ధనలక్ష్మి, ఎస్వీ రమణతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

సీతంపేట : మండల ఎస్‌జిఎఫ్ సెలక్షన్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మంగళవారం స్థానిక ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో నిర్వహించారు. సుమారు 26 పాఠశాలల నుంచి 500మంది విద్యార్థులు పాల్గొన్నారు, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ క్రీడలకు ఎంపిక పోటీలు జరిగాయి. ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గంలో జరుగు క్రీడలకు అర్హులు, డిడి ఎం.శ్రీనివాసరావు, డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్చార్జ్ జాకబ్ దయానంద్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పిడిలు ఆర్‌సి రెడ్డి, వెంకట్రావు, రమణమూర్తి, ఈశ్వరరావు, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, సింహాచలం, శ్రీను, కళ్యాణి, శేఖరు, కామేశ్వరి, జగంతి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : జిల్లా, మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు మంగళవారం డోకిశిల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరిగాయి. మంగళవారం వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర పోటీల్లో విద్యార్థులు పాల్గొని ఎంపిక పోటీలను దిగ్విజయంగా నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక ప్రధాన ఉపాధ్యాయులు సిహెచ్ గోవిందరావు, సర్పంచ్ ఎస్.జగదీష్, డాక్టర్ బడే ఐశ్వర్యతో పాటు వసతి గృహ సంరక్షకులు యు.రమేష్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ ఎంపిక పోటీలు నిర్వహించి నియోజకవర్గం పోటీలకు 150 మంది ఎంపికయ్యారని స్థానిక వ్యాయామ సంచాలకులు ఎం.వాసుదేవ నాయుడు, పిఇటి ఇల్లు దుర్గాప్రసాద్ తెలిపారు.

భోజనం కోసం క్యూలో నిల్చొన్న విద్యార్థులు

వర్షంలోనే భోజనాలు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు భోజనాల కోసం అవస్థలకు గురయ్యారు. అప్పటి వరకు ఎండ వేయడంతో ఉన్న వాతావరణం ఒక్కసారిగా ఆకాశంలో మార్పు రావడంతో సుమారు గంటసేపు వర్షం పడవడంతో మండలంలోని సుమారు 500 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. వీరికి భోజనాలు పెట్టేందుకు వంటగది సౌకర్యం లేక నిర్వాహకులు ఆరుబయట వంటలు చేశారు. అయితే సకాలంలో క్రీడాకారులకు భోజనాలు పెట్టలేకపోయారు. అలాగే భోజనం కోసం క్రీడాకారులు క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్నపాటి చినుకు పడినప్పుడు కూడా వర్షంలోనే వంట నిర్వాహకులు ఎన్నో అవస్థల పడి క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పించారు.

పార్వతీపురంలో పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం. సర్పంచ్

కురుపాంలో కురుస్తున్న భారీ వర్షం

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఆకాశం పూర్తిగా మేఘామృతమై భారీగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మొదలైంది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి కురుపాంతో పాటు పలు గ్రామాలు తడిసిముద్దయ్యాయి. చాలా రోజులుగా వర్షాలు పడుతున్నప్పటికీ ఇంత పెద్ద వర్షం కురవడంతో నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం కురిసిన వర్షంతో రైతాంగంలో ఆనందం వెల్లి విరుస్తుంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు వాతావరణం సరిగ్గా లేక నియోజకవర్గంలో పలు గ్రామాల్లో నాట్లుపడని పడని పరిస్థితి ఉంది. ఆయా గ్రామాల్లో వేసిన నారులు 45 రోజుల నుంచి 50 రోజులు దాటు ఉన్నాయి. ప్రస్తుతం కురిసిన వర్షంతో పూర్తిస్థాయిలో నాట్లు వేసేందుకు అనుకూలమైంది. ఈ వర్షంతో రైతాంగానికి ఉపశమనం కలగడంతో రైతుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విడివికె సభ్యుల శిక్షణ పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసిలో నిర్వహిస్తున్న విడివికెల సభ్యుల ఎంటర్ ప్రెన్యూర్ షిప్ మార్కెటింగ్ పై శిక్షణ కార్యక్రమాన్ని ఐటిడిఎ ఎపిఒ రోసిరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణలో ఇస్తున్న అంశాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులకు పెట్టే బోజనాలను పరిశీలించారు. వారం రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైటిసి మేనేజర్ వెంకటరమణ, ఎపిఎంలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఎంఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ లక్ష్యాలను పూర్తిచేసే చేయాలన్నారు. అలాగే గడపగడపకు ఇచ్చిన పనులను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఎఇ జానకీరామ్, అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాంబాబును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టపూడివలస ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న సాకేటి రాంబాబుకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడంతో మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ వి.భారతి, వైస్ చైర్మన్ రమాదేవి, ఉపాధ్యాయులు ఎం.రామినాయుడు, సిహెచ్ చంద్రశేఖర్, పిఆర్పి సింహాచలం, అంగన్వాడీ కార్యకర్త సిహెచ్ పద్మ,, విద్యార్థులు పాల్గొన్నారు.

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఉపాధి నిధులతో ఇంకుడు గుంతలు

పార్వతీపురం రూరల్ : మండలంలోని పాఠశాలలు, సచివాలయాలు ప్రభుత్వ భవనాల పరిసరాల్లో వర్షపు నీరు సంరక్షణకు ఇంకుడు గుంతలు నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయని జెఇ కూర్మారావు తెలిపారు. మంగళవారం ఎమ్మానగరం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ఆవరణలో నిర్మించ నున్న ఇంకుడు గుంత పనులకు మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో గుంత రూ.70 వేల నిధులతో నిర్మిస్తున్నామన్నారు. ఇందులో వేతనదారులు, మెటీరియల్ కాంపౌండ్ ప్రతిపాదిత సాధనలో ఖర్చు చేస్తామని తెలిపారు. మండలంలో పుట్టూరు 1, డోకిసీల 2, బందలుప్పి1, ఎమ్మార్ నగరం3 లక్ష్మీనారాయణ పురం1, డోకిసీల1, గంగాపురం1 ఇంకుడు గుంతలను నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిసి సంధ్య, ఎఫ్‌సిపాల్గొన్నారు.

సెంటర్ లైటింగ్‌ను పునరుద్ధరించాలి

పార్వతీపురంటౌన్ : పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే రాయగడ రోడ్డు బస్‌స్టాప్ వద్ద ఉన్న సెంటర్ లైటింగ్ గత వారం రోజుల నుండి వెలగక పోవడంతో రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి సెంటర్ లైటింగ్‌ను పునర్దించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసి రావు మంగళవారం మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడును కోరారు.

గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చూడాలి

ప్రజాశక్తి - బెలగాం

గర్భిణులు రక్తహీనతకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని జనసేన నాయకులు కోరారు. మంగళవారం జనసేన నాయకులు వంగల దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, తామరకండి తేజ, కర్రి మణికంఠ, పైలరాజు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో గర్భిణుల్లో అధికంగా రక్తహీనత కనిపిస్తోందన్నారు. ప్రతిరోజు ప్రసవ సమయంలో కుటుంబ సభ్యులు రక్తం కోసం అన్వేషించడం పరిపాటిగా మారిందన్నారు. అంగన్వాడీల ద్వారా వీరికి వైయస్సార్ సంపూర్ణ, వైయస్సార్ ప్లస్ తదితర పథకాలు పక్కాగా అమలయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. జిల్లాలో గిరిజన గర్భిణులు రక్తహీనతకు లోన అవుతున్నారన్నారని, వీరిపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరం అన్నారు. డోలీల మోతలు, 108 లో ప్రసవాలు, విశాఖ, విజయనగరం తదితర ప్రాంతాలకు రిఫెరల్ లేకుండా సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఆశా, సిహెచ్‌డబ్ల్యుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర డిమాండ్ చేశారు. మంగళవారం ఆశా, వర్కర్లు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు ఇందిర, కొల్లి సాంబమూర్తి, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు రాజేశ్వరి, కమ్యూనిటీ హెల్త్ వర్కింగ్ నాయకులు దుర్గ మాట్లాడుతూ మండలంలోని కొమరాడ, మాదలింగి, కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశా, కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు కల్పించాలని, టిఎ, డిఎలు ఇవ్వాలని, కరోనా సమయంలో మరణించిన ఆశా వర్కర్ల కుటుంబాలకు అన్ని విధాలా భరోసా కల్పించాలని అన్నారు. ప్రత్యేకించి కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు యూనిఫారం, గడిచిన 21 నెలల జీతాలు తక్షణమే ఇవ్వాలని సూచించారు. ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు గానూ పని ఒత్తిడి తగ్గించాలని పై సమస్యలు పరిష్కారం చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఇందిర

'బాబు'అరెస్టుకు నిరసనగా రిలేనిరాహారదీక్షలు

ప్రజాశక్తి - కొమరాడ

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టును వ్యతిరేకిస్తూ మండలంలోని టిడిపి నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళవారం మండల కేంద్రంలో అరకు పార్లమెంటరీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బిడ్డిక తమ్మయ్య ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా తమ్మయ్య మాట్లాడుతూ చంద్రబాబును ప్రభుత్వ అక్రమంగా అరెస్టు చేయడం చాలా దారుణమని అన్నారు. వైసిపి ప్రభుత్వంతో ప్రజాసమస్య వ్యవస్థ పూర్తిగా నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు జైలు నుంచి బయటకు వచ్చేవరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని వారు తెలిపారు. రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న టిడిపి నాయకులకు మద్దతుగా జనసేన నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ రిలే దీక్షలో మరడాన వెంకటనాయుడు, మీసాల శశిభూషణ్ రావు, కేతిరెడ్డి అచ్యుత్ రావు, రాజానురాము, జాగాన గౌరీశంకరరావు, జనసేన నాయకులు పల్లి శ్రీకాంత్, కశిణబోయిన చంటి, మరడాన రామకృష్ణ, మడక నారాయణ పాల్గొన్నారు.

కురుపాం : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మంగళవారం ఉమ్మడి జిల్లాల టిడిపి శ్రేణులకు విజయనగరంలో జరిగిన బాబుకి తోడుగా కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయిక జగదీశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నియంత పరిపాలనకు అద్దం పట్టేలా వ్యవహరించారని, దీనికి ఉదాహరణే చంద్రబాబు నాయుడుపై అక్రమ అరెస్టు చేయడమే నిదర్శనమని అన్నారు. ప్రజలు నియంత పరిపాలన విధానాలన్నింటిని గమనిస్తున్నారని, కచ్చితంగా రానున్న ఎన్నికల్లో నియంతకు బుద్ధి చెపుతారని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో గల టిడిపి మండల కన్వీనర్లు, పార్లమెంట్ కమిటీ నాయకులు, నియోజకవర్గ కమిటీ నాయకులు, సమన్వయ కమిటీ నాయకులు, క్లస్టర్ ఇంఛార్జి లు యూనిట్ ఇంఛార్జిలు పాల్గొన్నట్లు తెలిపారు.

కొమరాడలో దీక్షలు చేస్తున్న టిడిపి నాయకులు

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి - కొమరాడ/గరుగుబిల్లి

ప్రాణాంతక వ్యాధులకు గురి కాకుండా పిల్లలకు పూర్తి స్థాయిలో వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరి అని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. మిషన్ ఇంద్ర ధనుష్ రెండో విడతలో భాగంగా వైద్య సిబ్బంది నిర్వహించిన టీకా కార్యక్రమాలను మండలంలో గుణానుపురం, అర్తాం గ్రామాల్లో ఆయన మంగళవారం పరిశీలించారు. ఈరోజు సెషన్స్‌లో ఎంతమందికి టీకా వేస్తున్నారని, సిబ్బందిని ఆరా తీయగా 8మంది ఐదేళ్లలోపు పిల్లలకు, ముగ్గురు గర్భిణులకు వేస్తున్నట్లుగా తెలిపారు. వారి వివరాలను ఆయన ఆర్‌సిహెచ్ రిజిస్టర్స్, టీకా కార్డుల్లో పరిశీలించారు. వేసేముందు టీకా ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. టీకాల ఆన్లైన్ నమోదుకు సంబందించిన యూవిన్ పోర్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు అక్కడ చిన్నారికి టీకా చుక్కలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 11న ప్రారంభమైన మిషన్ ఇంద్ర ధనుష్ రెండో విడత కార్యక్రమం 16 వరకు కొనసాగుతుందని, ఐదేళ్లలోపు పిల్లలు ప్రాంతాల వ్యాధులకు గురికాకుండా, ముఖ్యంగా తట్టు, రుబెల్లా తదితర వ్యాధులు పూర్తి స్థాయిలో నిర్మూలించడం మిషన్ ఇంద్ర ధనుష్ ఉద్దేశ్యమని అన్నారు. గతంలో ఏవైనా కారణాల వల్ల టీకా వేసుకొని పిల్లలకు, ప్రస్తుత షెడ్యూలు ప్రకారం అర్హులైన పిల్లలు, గర్భిణీ లకు టీకా వేయడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సూపర్ వైజర్స్ నిర్మల, జయగౌడ్, వైద్య సిబ్బంది శ్రావణి,వర్షిణి, రామకష్ణ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావివలస పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కర్రి అరుణకుమారి ప్రారంభించారు. ఈ మేరకు పిహెచ్‌సి పరిధిలోని ఆయా గ్రామాల్లో రెండో విడత చేపడుతున్న మిషన్ ఇంద్రధనస్సు టీకా కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సు రెండవ విడత టీకా కార్యక్రమంలో గర్భిణీలకు, ఐదేళ్లలోపుపిల్లలకు వ్యాధి నిరోధకటీకాలు సిబ్బంది వేయనున్నారన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గుంట్రెడ్డి.సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

గరుగుబిల్లి : టీకాల నమోదును పరిశీలిస్తున్న వైద్యాధికారి అరుణకుమారి

ఎంపియుపి పాఠశాలలో ఎంఇఒ తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని అడ్డాపుశీల పాఠశాలను పార్వతీపురం ఎంఇఒ-2 కర్రి ప్రసాదరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల హాజరు వివరాలు, ప్రగతి తదితర విషయాలను తనిఖీ చేశారు. అలాగే తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు పాఠశాలలో అందిస్తున్న విద్య, పుస్తకాలు, మధ్యాహ్నం భోజనం పథకం అమలు, జరుగుతున్న విధానాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందజేస్తున్న భోజనం నాణ్యతను దగ్గరుండి పరిశీలించారు. పాఠశాల భవనాల పరిస్థితిని, మరుగుదొడ్ల నిర్వహణ ఏ విధంగా జరుగుతుందో పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వెంకట్రావు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు పనులు

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో గుంతలయమైన రోడ్డు మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కాలువలు తీసిన అనంతరం పనులు నిలిపివేయడంతో స్థానిక ధూళికేశ్వరాలయ సమీపంలో రోడ్డంతా గుంతలమయమైంది. దీంతో వర్షాలు పడిన సమయంలో ఆ గుంతల్లో నీరు నిలిచిపోవడంతో అనేక మంది ద్విచక్ర వాహన చోదుకులు పడి తీవ్ర గాయాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. దీంతో స్థానిక ఉపసర్పంచ్ షేక్ఆదిల్ స్పందించి మంగళవారం గుంతలమయమైన రహదారి వద్ద తాత్కాలికంగా ట్రాక్టర్‌తో కసరా బుగ్గి మెటల్‌తో కూడింది తెప్పించి జెసిబితో గుంతలన్నీ కప్పించారు. ఈ సందర్భంగా వాహన చోదకులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రాజీలేని సూత్రాలతో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయంలో రాజీలేని సూత్రాలు పాటించడం వల్ల పంటలకు ఆశించిన పురుగులు, తెగుళ్లను నివారించవచ్చని కోఆర్డినేటర్ కమిడి భూషణ్ తెలిపారు. మండలంలోని జెకెపాడు గ్రామంలో ప్రకతి వ్యవసాయంలో రైతులు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కో-ఆర్డినేటర్ భూషణ్ మాట్లాడుతూ వ్యవసాయంలో రాజీలేని సూత్రాలు పాటించడం వల్ల పంటకు ఆశించిన పురుగులు, తెగుళ్లను నివారించవచ్చని అన్నారు. పురుగులు, పక్షుల వల్ల పంటకు నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ద్రవజీవామృతం తయారు చేసి ఐదు రోజులు కవరులో నిల్వ చేసి పంట పొలాల్లో పిచికారీ చేయడం ద్వారా మొక్కలకు కావలసిన పోషకాలు లభిస్తాయి అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సభ్యులు గణేష్ చంద్ర, నిర్మల, పద్మజ, పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులను సరిదిద్దాలి

ప్రజాశక్తి - భామిని

మండలంలోని కొన్ని పంచాయతీల్లో ఓటర్ జాబితా సమాచారం సరిగ్గా లేదని, బతికున్నవారిని డెత్‌గా, మైగ్రేషన్ గా చూపిస్తున్నాయని, ఈ అంశాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పంచాయతీ స్థాయిలో గ్రామ సభలు నిర్వహించి వాటిని పూర్తి స్థాయిలో సరిదిద్దాలని సచివాలయల జెసిఎస్ కో -ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ తహసీల్దార్ నీలపు అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భామిని పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, వైసిపి నాయకులు చంటి ఉన్నారు.

నీరు వృథాగా పోతున్నా పట్టదా?

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న వినాయక ఆలయం వద్ద తాగునీటి కుళాయి పైపు విరిగి పైపు ద్వారా కళ్ల ముందే తాగునీరు వృథాగా పోతున్నా సంబంధిత నివాస గృహ యజమాని గాని, మున్సిపల్ తాగునీరు సరఫరా చేసే సిబ్బంది కానీ పట్టించుకోకపోవడంతో తాగునీరు వృథాగా పోతుంది. ఇక్కడ తాగునీరు వృథాగా పోతుండడం చూసిన స్థానికులు కొన్ని వీధుల్లో తాగునీటి సరఫరా అంతంత మాత్రమే జరుగుతూ ఇబ్బందులు పడుతుంటే ఇలా వృథాగా పోవడం బాధాకరమని చర్చించుకుం టున్నారు. సంబంధిత మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు నివాస గృహ యజమానిపై చర్యలు చేపడితే మిగతా వారికి కనీస బాధ్యత ఉంటుందని స్థానికులు అంటున్నారు..

వృథాగా పోతున్న తాగునీరు

సారా, మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ శివారులోని కొట్టక్కి పాత వంతెనపై మంగళవారం 401 మద్యం సీసాలు, 849.5 లీటర్ల సారా ప్యాకెట్లను పోలీసులు ధ్వంసం చేశారు. ఇంఛార్జి డిఎస్పీ జి.మురళీధర్ సమక్షంలో టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యాన అక్రమ సారా మద్యం సీసాలను ధ్వంసం చేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన అక్రమ సారా మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు.

10వాహనాలు వేలం

పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన వేలం పాటలో పది వాహనాలు వేలం అయినట్లు సిఐ సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. 14వాహనాలకు గాను పది వాహనాల వేలం జరిగిందని తెలిపారు.

17న ద్విచక్ర వాహనాలు వేలం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఈనెల 17న ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో అక్రమ సారాయి రవాణాలు పట్టుబడ్డ ఐదు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు ఎస్సై సింహాచలం తెలిపారు. వాహనాల వివరాలు కోసం రూరల్ పోలీస్ స్టేషన్లో అడిగి తెలుసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

టెంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

పర్యాటకంలో భాగంగా ఆడలి వ్యూ పాయింట్ వద్ద పర్యాటకుల కోసం నైట్ క్యాంపింగ్ టెంట్లు, భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి గల గిరిజన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ కల్పనకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైనవారు సీతంపేట ఏజెన్సీ అందాలను వీక్షించడానికి వచ్చే పర్యాటకులకు ఆడలి వ్యూ పాయింట్ వద్ద రాత్రి బస చేసేందుకు వీలుగా నైట్ క్యాంపింగ్ టెంట్లు, భోజన, వసతి సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందని తెలిపారు. దీంతోపాటు సీతంపేటలో గల అన్ని పర్యాటక ప్రదేశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి సీతంపేటకు వచ్చే పర్యాటకులకు మంచి గైడ్‌గా కూడా వ్యవహారించాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికలో ఆడాలి కొండ, సీతంపేట పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. కావున ఆసక్తి గలవారు పూర్తి వివరాల కోసం 9392917692, 9493469084 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన మహిళలు స్థానిక ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 తేదీలోగా iti.ap.gov.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 20లోగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 22న కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని, ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని తెలిపారు. ఐటిఐలో కంప్యూటర్, డ్రెస్ మేకింగ్, టైలరింగ్ తదితర అన్ని కోర్సులకు సీట్లు ఉన్నాయని తెలిపారు. 8 లేక పదో తరగతి పాసైన 40 ఏళ్ల లోపు వయసు గల గిరిజన మహిళలు అర్హులని అన్నారు. అన్ని గ్రూపులకు మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు మరిన్ని వివరాలకు 9989386634 నెంబర్ సంప్రదించాలని కోరారు.

నడుకూరులో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం నడుకూరులో మంగళవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జ్వర పీడితులతో పాటు గర్భిణీలకు, మధుమేహం, రక్తపోటు తదితర రకాల వ్యాధిగ్రస్తులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంత కుమారి, ఎఎన్ఎం సరస్వతి, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు ,పాల్గొన్నారు.

దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

అక్రమ లాకౌట్‌ను ప్రతి ఒక్కరూ ఖండించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని జీగిరాం జ్యూట్ మిల్ అక్రమ లాకౌట్‌ను అన్ని రాజకీయ పక్షాలు, ప్రజలు వ్యతిరేకించాలని జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జ్యూట్ మిల్లు కార్మికులు చేపడుతున్న నిరసన దీక్షకు మద్దతుగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అనంతరం జెఎసి ప్రతినిధులు మాట్లాడుతూ యాజమాన్యం అన్యాయంగా జ్యూట్ మిల్లును లాకౌట్ వేసి నేటికి 15 నెలలు కావస్తున్నా స్థానిక మంత్రి గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోవడంలేదన్నారు. ఇంకా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి అక్రమంగా మూసి వేసిన జ్యూట్ మిల్లును తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని, లేకుంటే భవిష్యత్‌లో ప్రజలందరితో కలిసి నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. ప్రజా సంఘాలు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ మిల్లు మూతపడి 14 నెలలు కావస్తున్నా నేటికి అధికారులు గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోవడం లేదని వాపోయారు. జిల్లాలో ఒకే ఒక్క జ్యూట్ మిల్లు జిగిరాం మిల్లు అని, అటువంటి మిల్లులో సుమారు రెండు వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని, వీరంతా నేడు ఉపాధికి సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, తక్షణమే ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి మిల్లును తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి ప్రతినిధులు సిద్దా బత్తుల సింహాచలం, పువ్వుల శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన పోలీసు స్టేషన్‌కు వెళ్లే రోడ్డు

నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

'వడ్డించేవాడు మనవాడైతే కడవరకు భోజనం చేయొచ్చు అన్న చందాన అధికారి మనవాడైతే పనుల్లో నాణ్యత ప్రమాణాలు లేకపోయినా ఫర్వాదు అన్నట్టుంది ఇక్కడి తీరు. మండల కేంద్రంలోని 1,2,3,4,సచివాలయాల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సుమారు రూ .80 లక్షలతో సిసి రహదారి అభివృద్ధి నిర్మాణ పనులు చేపడుతున్నారు. లెంక వీధి, బర్నాల, దుర్గాపేట, మేజర్ పంచాయితీ కార్యాలయం రహదారులతో పాటు చాపల మార్కెట్ నుండి పోలీస్ స్టేషన్‌కు వెళ్లే సిసి రహదారి నిర్మాణ పనులు ఈనెల 11న చేపట్టారు. ఎట్టకేలకు ఈ రహదారి పనులు చేపట్టడంతో ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే పనుల్లో నాణ్యత లేకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారిపై రాళ్లు తేలిపోయాయి. దీంతో మరమ్మతు పనులపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎక్కువ కాలం ఉండాల్సిన రహదారి ఇప్పుడే ఇలా అయిపోతే రానున్న రోజుల్లో ఎలా ఉంటుందో చేసిన పనులు చూస్తేనే అర్థం చేసుకోవచ్చును. ఇప్పటికైనా అధికారులు స్పందించి మేజర్ పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో వ్యక్తి ఏడాది జైలు

ప్రజాశక్తి - సీతానగరం

దొంగతనం కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలు, రూ.2వేలు జరిమానా విధిస్తూ బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి ఎం.సరోజనమ్మ మంగళవారం తీర్పు చెప్పారని స్థానిక ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. 2021 సెప్టెంబర్‌లో జానుమల్లువలసకు చెందిన యాల్ల నారాయణ రావు తన బీరువాలో దాచిన 48 గ్రాముల రెండు పేటల బంగారం పుస్తెల తాడుకు చోరీకి గురైంది. దీంతో బాధితురాలు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ బి.మురళి కేసు నమోదు చేశారు. తదుపరి ఎస్ఐ కె.నీలకంఠం ఈ కేసును దర్యాప్తు చేసి 2022 సెప్టెంబర్‌లో అదే గ్రామానికి చెందిన చుక్క శ్రీనివాసరావును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి దొంగిలించిన 48 గ్రాముల రెండు పేటల బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. తదుపరి దర్యాప్తు అనంతరం విచారణ జరిపి సదరు ముద్దాయికి ఏడాది జైలు, రూ.2వేలు జరిమానా విధించారు. ఈ కేసుకు ప్రభుత్వం తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాక్యూటర్ నరేశ్ వాదించారు.

80లీటర్ల నాటుసారాతో ఒకరు అరెస్టు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్‌కె పాడు శివారులో అక్రమంగా మద్యం అమ్ముతున్న మహిళను అదుపులోకి తీసుకొని 80లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సణ్ముఖరావు తెలిపారు. మహిళా నిందితురాలిపై కేసు నమోదు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా అక్రమంగా మద్యం అమ్మకాలు, వంటకాలు చేసినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.